




# తొలి సమయం

దిన పత్రిక

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 321 శనివారం 16-11-2024 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..


## రుణమాఫీపై త్వరలోనే ప్రకటన

**వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల వెల్లడి**



**హైదరాబాద్, నవంబర్ 15:** రూ.2లక్షలకు పైబడిన వాళ్ళ రుణమాఫీ పై త్వరలోనే ప్రకటన చేస్తామని వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుడ్ న్యూస్ చెప్పారు. రైతు భరోసా సబ్ కమిటీ నివేదిక రాగానే రైతులకు అందజేస్తామన్నారు. ఈ ఏడాది వరి సాగులో తెలంగాణ టాప్ స్థానంలో నిలిచిందన్నారు. ఒక కోటిన్నర లక్షల ఎకరాల దిగుబడితో పంజాబ్ రాష్ట్రాన్ని వెనక్కి నెట్టామన్నారు. గతంలో 41లక్షల ఎకరాలల్లో ఉన్న దొడ్డు ధాన్యం ఈ ఏడాది 21లక్షలకు పడిపోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సన్న ధాన్యం దిగుబడి పెరిగిందని, దేశ వ్యాప్తంగా సన్న ధాన్యానికి డిమాండ్ పెరిగిందన్నారు. 25 జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో ఈ రోజు నాటికి 17 జిల్లాల్లో మాత్రమే జరిగాయన్నారు. 9.7 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ళు ఇప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా చేశారన్నారు. 6 వందల 25 కోట్లు ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు డబ్బులు అందించామన్నారు. బీజేపీ %-% బీఆర్ఎస్ పార్టీ నాయకులు రైతుల మనోధైర్యం దెబ్బతినే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. గతంతో పోల్చితే ఉత్పత్తి, కొనుగోళ్లు పెరిగాయన్నారు. అధికారం పోయినంత మాత్రాన ఇంతగనం ఆందోళన అవసరం లేదన్నారు. వాళ్ళ పార్టీలో ఆధిపత్యపోరు కోసం రైతులను ఇబ్బంది పెట్టకండి అని సూచించారు. రైతుల పై ఒత్తిడి లేదు.. ఓపెన్ మార్కెట్ లో అవకాశం ఉన్నా అమ్ముకోవచ్చున్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే ప్రతీ గింజా మేము కొంటామన్నారు. కేంద్రం గైడ్లైన్స్ లో మార్పులు చేయాలని కోరుతున్నామని తెలిపారు.



## ఆదివాసీ మహిళ ముర్మును
# రాష్ట్రపతిని చేశాం

**ఆదివాసీలను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్న మోడీ**

**పట్నా,నవంబర్15:** దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఓ ఆదివాసీ మహిళకు తమ ప్రభుత్వం అత్యున్నత రాష్ట్రపతి పదవిని ఇచ్చి గౌరవించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివాసీ బిడ్డ ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతిని చేయడం ఎన్డీఏ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. మొదట్లో ఆ పదవికి ఆమె పేరును ప్రతిపాదించగానే ముర్మును భారీ మెజారిటీతో గెలిపించాలని బిహార్ సీఎం నితీశ్ కుమార్ దేశం మొత్తానికి పిలుపునిచ్చారని ప్రధాని గుర్తుచేసుకున్నారు. పీఎం జన్మన్ యోజన పథకం ద్వారా పనుల ప్రారంభ ఘనత ద్రౌపదీ ముర్ముదే అని కొనియాడారు. ఆదివాసీల కష్టాలను తీర్చేందుకు ఈ పథకం ద్వారా రూ.24వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. బిహార్‌లో నిర్వహించిన సభలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఆదివాసీలు తమ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ధర్తీ అబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా బీహార్‌లోని జాముయ్‌లో ప్రధాని మోడీ ఆయనకు నివాళులర్పించి, ఆయన పేరిట పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. 6000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. గిరిజన సమాజాన్ని నిర్లక్ష్యం చేయడానికి గత ప్రభుత్వాలే కారణమని ప్రధాని మోడీ అన్నారు. గత ప్రభుత్వాల వల్ల గిరిజన సమాజం నిర్లక్ష్యానికి గురైందన్నారు. గిరిజన సమాజం దేశాభివృద్ధి రేసులో వెనుకబడింది. దేశ స్వాతంత్ర్యానికి ఒక పార్టీ లేదా ఒక కుటుంబం సహకరించిందని చేసే ప్రచారం తప్పన్నారు. గిరిజన సమాజంలోని ఎందరో మహానాయకులు త్యాగాలు చేశారని ప్రధాని మోడీ అన్నారు. గిరిజన సమాజం చేసిన కృషికి చరిత్రలో సముచిత స్థానం దక్కలేదన్నారు. ఏళ్ల తరబడి గిరిజన సంఘం నిర్లక్ష్యానికి గురైంది. గిరిజన సమాజం, సహకారం, త్యాగాన్ని తుడిచిపెట్టే ప్రయత్నం జరిగిందన్నారు. అత్యంత వెనుకబడిన గిరిజనులపై ఎలాంటి శ్రద్ధ తీసుకోలేదన్నారు.

## మామీద కోపంతో పేదలకు
# నష్టం చేయొద్దు

**రైతులను జైల్ల నుంచి విడుదల చేయాలి**

**రేవంత్‌కు తప్పకుండా పేదోడి ఉసురు తగులుతుంది : కేటీఆర్**



**సంగారెడ్డి, నవంబర్ 15:** మామీద ఉన్న కోపంతో పేదలకు నష్టం చేయొద్దని, సీఎం రేవంత్ రెడ్డి దమ్ముంటే మాతో కొట్లాడు.. రాజకీయంగా తలపడు కానీ పేదలకు మాత్రం కష్టం కలిగించొద్దు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. లగచర్ల రైతులపై నమోదు చేసిన కేసులన్నీ రద్దు చేసి, వెంటనే వారిని జైళ్ల నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. సంగారెడ్డి జైల్లో లగచర్ల రైతులతో ములాఖత్ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ శివార్లలో ఫార్మాసిటీ కేసీఆర్ పెడితే రేవంత్ వాళ్ల కుటుంబ సభ్యుల కోసం మార్చారు. లగచర్లతో పాటు సంగారెడ్డి జిల్లా న్యాలకల్‌లో కూడా రైతులు పోరాటం చేస్తున్నారన్నారు. కేసీఆర్ మీకు అండగా ఉంటారు... ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎదుర్కొంటాం.. ఈ ప్రభుత్వానికి తప్పకుండా పేదవాడి ఉసురు తగులతది. 30, 40 కిలోల బరువు లేని పిల్లలు కలెక్టర్‌పై హత్యాయత్నం చేశారని కేసులు పెట్టడానికి మనసు ఎలా ఒప్పింది రేవంత్ రెడ్డి..? చేతనైతే మాతో కొట్లాడు. రాజకీయంగా మాతో తలపడు. పేదలకు కష్టం కలిగించొద్దు. ఈ కేసులన్నీ రద్దు చేసి రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాను. రైతులకు, పేదలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. గర్భిణి అయిన జ్యోతిని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ రేపు హాస్పిటల్‌కు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయిస్తుంది. పేద వర్గాలకు అండగా నిలబడడమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని కేటీఆర్ స్పష్టం చేశారు.

## త్వరలోనే బిఆర్ఎస్ నుంచి
# మరిన్ని చేరికలు

**కాంగ్రెస్‌లో చేరేందుకు రెడీగా ఎమ్మెల్యేలు**

**పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి**



**తొలి సమయం, హైదరాబాద్,నవంబర్15:** కాంగ్రెస్ పార్టీలో త్వరలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల చేరికలు ఉంటాయని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.బీఆర్ఎస్ పార్టీలోని అగ్ర నాయకులు, మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ ఒకే పార్టీలో ఉండరని ఈ సందర్భంగా ఆయన జోస్యం చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి కేబినెట్ విస్తరణపై ఇప్పటికే సంప్రదింపులు పూర్తయ్యాయని తెలిపారు. తనకు, సీఎం రేవంత్ రెడ్డికి మధ్య మంచి సన్నిహిత సంబంధాలున్నాయన్నారు. అయితే బీఆర్ఎస్‌లోని పలువురు కీలక నేతలు బీజేపీలోకి వెళ్తారని ఆయన పేర్కొన్నారు. ఇక శనివారం నుంచి తాను జిల్లాల పర్యటన చేస్తానని.. అందులోభాగంగా ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తానని చెప్పారు. అలాగే పార్టీల్లో ఉన్న ఇబ్బందులను సైతం సరి చేస్తానని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మరోవైపు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా కేబినెట్ విస్తరణతోపాటు పలు అంశాలపై పార్టీ పెద్దలతో ఆయన చర్చించినట్లు తెలుస్తుంది. అలాగే రాష్ట్రంలో ప్రస్తుతం కుల గణన జరుగుతుంది. అదే విధంగా మరికొద్ది రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఆయా అంశాలపై సైతం ఆయన పార్టీ సీనియర్లతో చర్చించినట్లు సమాచారం. ఇంకోవైపు గతేడాది చివరల్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం కొలువు తీరింది. దాంతో బీఆర్ఎస్ ప్రతిపక్షానికి పరిమితమైంది. ఇక సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌లో పలువురు బీఆర్ఎస్ అగ్రనేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో బీఆర్ఎస్ పార్టీలో కేవలం కేసీఆర్ ఫ్యామిలీ మాత్రమే ఉన్నదన్నట్లుగా పరిస్థితి మారింది.

## వారిది ఔరంగజేబ్
# ఫ్యాన్స్ క్లబ్

**మహారాష్ట్ర ప్రచారంలో అమిత్ షా విమర్శలు**

**ముంబై,నవంబర్15:** మహారాష్ట్రలోని మహా వికాస్ అఘాడి(ఎంవిఏ)ని 'ఔరంగ్ జేబ్ ఫ్యాన్ క్లబ్' అని కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. అంతేకాక వీర్ సావర్కర్, శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాకరేను దమ్ముంటే ప్రశంసించాలని రాహుల్ గాంధీకి సవాలు విసిరారు. 'ఉద్ధవ్ గారు, ఒకవేళ మీకు దమ్ముంటే వీర్ సావర్కర్, బాలాసాహెబ్ మీద రెండు మంచి మాటలు రాహులు గాంధీతో అనిపించండి' అన్నారు. మహారాష్ట్రలోని హింగోలిలో జరిగిన ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ ఈ విషయం చెప్పారు. నవంబర్ 20 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగడానికి ముందు ఆయన ఈ విషయం చెప్పారు.'రాహుల్ బాబా కాంగ్రెస్ పార్టీ కశ్మీర్ లో 370 ఆర్టికల్ తిరిగి తీసుకొస్తామని తీర్మానం చేసింది. జాగ్రత్తగా విను, నువ్వే కాదు?నీ నాలుగో తరం కూడా తీసుకురాలేదని షా తెలిపారు. ఇదిలావుంటే మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలవేళ.. ప్రచారంలో పాల్గొనే నేతల బ్యాగులు, హెలికాప్టర్లలో తనిఖీల పరంపర కొనసాగుతోంది. తాజాగా హింగోలి అసెంబ్లీ నియోజక వర్గంలో ప్రచారం కోసం వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా హెలికాప్టర్‌ను అధికారులు తనిఖీ చేశారు. ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించిన ఆయన.. ఇందుకు సంబంధించిన వీడియోను



ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఎన్నికల ప్రచారం కోసం ఇక్కడకు వచ్చిన క్రమంలో నా హెలికాప్టర్‌ను అధికారులు తనిఖీ చేశారు. నిష్పక్షపాత, ఆరోగ్యక రమైన ఎన్నికల వ్యవస్థను భాజపా విశ్వసిస్తోంది. ఇందుకు మనమంతా సహకరించాలి. ప్రపంచంలో శక్తిమం తమైన ప్రజాస్వామ్య వ్యవస్థగా భారత్‌ను కొనసాగించడంలో మన బాధ్యతలను నిర్వర్తించాలి' అని అమిత్ షా పేర్కొ న్నారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే బ్యాగులను ఎన్నికల అధికారులు పలుమార్లు తనిఖీ చేయడం ఇటీవల చర్చనీయాంశమైంది. విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకున్నా రంటూ ఎన్నికల అధికారుల తీరుపై ఆయన విమర్శలు గుప్పించారు. దాంతో ఇది సాధారణ పక్రియే అంటూ ఈసీ కూడా క్లారిటీ ఇచ్చింది.

## భూములు లేని నిరుపేదలను
# రెచ్చగొట్టారు

**బీఆర్ఎస్ నేతల కనుసైగల్లో లగచర్లలో దాడులు**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం**

**తొలి సమయం, భైంసా, నవంబర్ 15:** నిర్మల్ జిల్లా భైంసాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతల కనుసైగల్లో వారి స్వార్థం కోసం నిస్వార్థంతో పనిచేసే ఉద్యోగులను భయభ్రాంతలకు గురిచేశారని మండిపడ్డారు. వారి ఫోన్లో ఏమాట్లాడారో చూసామని, భూములు లేని నిరుపేదలను రెచ్చగొట్టారు.. కలెక్టర్‌ను చంపాలని రెచ్చగొట్టారని ఆయన ఆరోపించారు. పింక్ కలర్ అసలు నాయకుల పాత్ర ఉందో దాన్నంతా ప్రభుత్వం ఎక్స్ రే తీసినట్ట అంతా బయకు తీస్తదని ఆయన అన్నారు. తప్పు చేసిన వారిని వదిలిపెట్టదని, గత ప్రభుత్వ



నాయకుల్లా కాదు.. ప్రతి పేదవాడికి ఇళ్లు ఇవ్వాలనేది మా ప్రభుత్వ చిత్తశుద్ధి అని ఆయన అన్నారు.సగం కట్టి వదిలేసిన ఇండ్లపై రివ్యూ చేస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి తీరుతామన్నారు మంత్రి పొంగులేటి. జనవరి నెల నుంచి తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి సన్న బియ్యం అందిస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా రైతు పండించిన ప్రతీ గింజ కొంటామన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. అంతేకాకుండా రైతుల కోసం అని కల్లాల బాట, మరో బాట అంటూ ఎవ్వరు పాదయాత్ర చేసి మోకాళ్లు అరగగొట్టుకోవాల్సిన పనిలేదని, డిసెంబర్ లోపు పక్కగా మిగిలిన రైతులకు రుణ మాఫీ చేస్తామని మంత్రి పోగులేటి హామీ ఇచ్చారు.

## సమగ్ర సర్వేపై తప్పుడు
# ప్రచారం చేస్తే సహించం

**సొంత ప్రయోజనాల కోసం కొందరు తప్పుడు ప్రచారాలు**

**ఇప్పటికే 30శాతం సర్వే పూర్తి**

**విధుల్లో 87వేల ఎన్యుమరేటర్లు**

**తొలి సమయం, సిద్దిపేట, నవంబర్ 15:** కొందరు కావాలనే వారి ప్రయోజనాల కోసం సమగ్ర సర్వేపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. సర్వేలో ఎలాంటి బ్యాంక్ వివరాలు అడగటం లేదని స్పష్టం చేశారు. 87వేల ఎన్యుమరేటర్లను పెట్టి సర్వే జరిపిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 30శాతం సర్వే పూర్తి అయ్యిందని తెలిపారు. సర్వే వల్ల ఎలాంటి నష్టం జరగదని అన్నారు. కొండపాక మండలం దుద్దేడ గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ...దేశానికి దిక్సూచిగా సర్వే నిలబడుతుందన్నారు. సర్వే కావాలని కోరిన వారే నేడు కనబడటం లేదని చెప్పారు. సర్వేను అడ్డుకున్న వారిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా అందరికీ గ్రంథాలయ వారోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి పాల్గొన్నారు."గ్రంథాలయాలు నిరుద్యోగ యువ తకు చదువుకోవడానికి ఉపయోగపడేలా చేయాలి. ఈరోజు ఎంప్లాయ్‌మెంట్ క్యాలెండర్ విడుదల చేస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలల్లో 45 వేల ఉద్యోగాలు ఇచ్చింది. చదివిన జ్ఞానం జీవితంలో ఏదో చోట ఉపయోగ పడుతుంది. ప్రపంచంలో ఏం జరుగుతుంది అనేది తెలుసుకునే వేదిక గ్రంథాలయం. సిద్దిపేట గ్రంథాలయం రాష్ట్ర గ్రంథాలయాలకు దీటుగా అభివృద్ధి చేస్తాం. నెహ్రూ ఐఐటీ, ఎయిమ్స్, విద్యాలయాలు, సాంకేతికత రంగంలో అభివృద్ధి చేయడం వల్లనే నేడు దేశం ముందుకు వెళ్తుంది. నెహ్రూ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ చదవాలి. బ్రాంచ్ లైబ్రరీల సంఖ్య తక్కువగా ఉంది కావాల్సిన మెటీరియల్ అందించాలి" అని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉన్న రైతులు అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

## గిరిజనుల సంక్షేమ కోసం స్వాతంత్ర పోరాటంలో

# పాల్గొన్న మహా వ్యక్తి బిర్సా ముండా

- నేటి యువత పోరాట యోధుల కళలను నెరవేర్చాలి
- బిర్సా ముండా కలలను సాకారం చేయాలి
- ఆదివాసీల ఆరాధ్య దైవం భగవాన్ బిర్సా ముండా





**తొలి సమయం కలక్టరేట్ మహబూబాబాద్ నవంబర్ 15:** ఆదివాసీల ఆరాధ్య దైవం భగవాన్ బిర్సా ముండా అని, గిరిజనుల సంక్షేమం కోసం దేశ స్వాతంత్రం కోసం పోరాటం చేసిన మహా వ్యక్తి అని ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. శుక్రవారం ఐ.డి.ఓ.సి లోని ప్రధాన సమావేశ మందిరంలో జన్ జాతీయ గౌరవ్ దివస్ దినోత్సవం, బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మహబూబాబాద్ శాసన సభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్,రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మ చారి లతో కలసి ఆదివాసీల ఆరాధ్య దైవం భగవాన్ బిర్సా ముండా చిత్ర పటానికి పులమలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ మాట్లాడుతూ మాట్లాడుతూ భూమి, నీటి కోసం పోరాటం చేయడమే కాకుండా భూమి శిస్తును వ్యతిరేకిస్తూ గిరిజన జాతి అభివృద్ధి కోసం నిరంతరం పోరాటం చేశారని, ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం జాతీయ యువ దినోత్సవం నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమ కోసం 78 వేల 600 కోట్ల నిధులను కేటాయించిందని, ఆ నిధులతో గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని వివరించారు. 1875 నవంబర్ 15వ తేదీన జన్మించిన బిర్సా ముండా చిన్నతనంలోనే బ్రిటిష్ వారిలో వణుకు పుట్టించారని, గిరిజనులలో మన సంస్కృతి మన విధానం అనే నినాదాలు ఇచ్చిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం పిఎం జన్మ పథకం ద్వారా గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం గత సంవత్సరం ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగిందని దీని ద్వారా 24 వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించి వాటి ద్వారా గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.పథకం కింద జిల్లాలో 92 గ్రామాలను ఎంపిక చేశారని ఈ సందర్భంగా తెలిపారు.గిరిజనుల సంక్షేమ కోసం హక్కుల సాధన కోసం పోరాటాలు చేసే గొప్ప వ్యక్తులు నేటికీ ఉన్నారని అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ 20 సంవత్సరాలు గల గిరిజన యువకుడు ప్రపంచాన్ని పాలిస్తున్న బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశాడని , గిరిజనుల జీవన విధానం సంస్కృతి హక్కులు పరిరక్షణ కోసం ఎంతగానో పోరాటం చేశారని ప్రత్యేకంగా స్వాతంత్ర పోరాటంలో గిరిజనుల పోరాటాలు కీలకపాత్ర పోషించాయని తెలిపారు. గిరిజన గ్రామాలు ఎవరి ఆధీనంలో బందీగా ఉండలేవని మా గ్రామాలు మా హక్కులు స్వతంత్రంగానే ఉంటాయని బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ గ్రామాలకు స్వతంత్రాన్ని ప్రకటించుకొని పాలించిన మహానుభావుడని కొనియాడారు. గతంతో పోలిస్తే గిరిజన ప్రాంతాలు గిరిజనుల జీవన ప్రమాణాలు ఏ విధంగా అభివృద్ధి చెందాయి మరింత అభివృద్ధి చెందాలంటే ఎలాంటి ప్రణాళికలు పథకాలు విది విధానాలు తీసుకురావాలో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పూర్వకాలంలో గిరిజనులు అనేక కష్టాలు ఎదుర్కొన్నారని బ్రిటిష్ ప్రభుత్వంలో దాదాపు 200 కు పైగా తెగలు క్రిమినల్స్ గా చిత్రీకరింపబడి వారి సొంత ప్రాంతంలో నివసించలేక అనేక ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితి ఉందని అలాంటి పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడిన గిరిజన నాయకుల త్యాగాలను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని తెలిపారు.ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ బిర్సా ముండా బ్రిటిష్ పరిపాలనకు వ్యతిరేకంగా గిరిజనుల హక్కుల కోసం ఎంతగానో పోరాడిన మహనీయుడని కొనియాడారు. అడవి, భూమి , నీటి పై ఉన్న సర్వహక్కులు వాటిని కాపాడుకోవడం కోసం వాటి పరిరక్షణ కోసం పోరాటం చేసి , చోటా నాగపూర్ అనే కౌలు చట్టాన్ని తీసుకొచ్చారని , వనజాతి - జనజాతి - మన గిరిజన జాతి అని వారి హక్కుల కోసం పోరాడాడని అన్నారు.స్వాతంత్ర పోరాటంలో బీర్సా ముండా గిరిజన జాతుల హక్కుల కోసం పోరాటం చేశారని అదేవిధంగా కొమరం భీమ్ కూడా గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ఎంతగానో కృషి చేశారని వీరి భావాలను ఆదర్శంగా తీసుకొని గిరిజన యువత ముందుకెళ్లాలని సూచించారు. గిరిజన అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ ఆచరణలోకి తీసుకురావాలని అన్నారు.ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమములో మున్సిపల్ వైస్ చైర్మన్ మారినేని వెంకన్న గిరిజన సంక్షేమ శాఖ అధికారి సైదా, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక అధికారి ఎర్రయ్య కలెక్టరేట్ పరిపాలనాధికారి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కందికొండ జాతర, కురవి వీరభద్ర స్వామి దర్శించుకున్న

## ఎంపీ కోరిక బలరాం నాయక్



**తొలి సమయం మహబూబాబాద్ నవంబర్ 15 :** కార్తీక పౌర్ణమి సందర్భంగా డోర్నకల్ నియోజకవర్గంలోని కందికొండ జాతరలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని మరియు కురవి వీరభద్ర పార్లమెంటు సభ్యులు కోరిక బలరాం నాయక్ దర్శించుకున్నారు.. ఆయనతో పాటుగా రాష్ట్ర టూరిజం చైర్మన్ శ్రీ పటేల్ రమేష్ రెడ్డి డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ లు పాల్గొన్నారు అనంతరం లక్ష్మీనరసింహస్వామి మరియు కూరవి వీరభద్ర స్వామి దీవెనలతో ప్రజలు సుఖశాంతులతో జీవించాలనికోరుకున్నారు.

## గండ్ర సత్యన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎర్రబెల్లి పున్నం చందర్ రావు



**తొలి సమయం జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 15:** శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఎర్రబెల్లి పున్నం చందర్ రావు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి..పుష్పగుచ్చం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనను నమ్ముకున్న వారి కోసం నిరంతరం కష్టపడే తత్వం కలిగిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు , ఆ దేవుని దీవెనలతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, ప్రజల ఆశీస్సులతో మరింత ఉన్నతమైన స్థానంలో నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

## కులగణనకు వ్యతిరేకంగా భాజపా కుట్ర

**బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్**



**తొలి సమయం మహబూబాబాద్ నవంబర్ 15 :** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన కులగణనకు వ్యతిరేకంగా భాజపా కుట్రలు చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ అన్నారు . శుక్రవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. కులగణనను వ్యతిరేకిస్తున్న పార్టీలకు పుట్టగతులుం డమన్నారు. బీసీ రిజర్వేషన్లను పెంచేందుకే ప్రభుత్వం కులగణన చేపట్టిందన్నారు. కులగణన కోసం వచ్చే అధికారులకు ఆటంకం కలిగించ వద్దన్నారు. అగ్రకులాల కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. బీసీలు కులగణనలో కులాన్ని నమోదు చేసుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల లోపు కులగణనను పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా కులగణనపై ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాజ్యాధికారం సాధించేవరకు ఉద్యమాలు కొనసాగుతాయన్నారు.

# గండ్ర సత్యన్నకు అభినందనల వెల్లువ

**-మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పోలినేని లింగారావు**

**తొలి సమయం జయశంకర్ భూపాలపల్లి 15:** శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పుట్టినరోజు సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మొగుళ్ళపల్లి మాజీ పీఏసీఎస్ చైర్మన్ పోలినేని లింగారావు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి..పుష్పగుచ్చం అందించి..ఆయన సమక్షంలో కేక్ కట్ చేసి..జన్మదిన శుభాకాంక్షలు



తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భూపాలపల్లి అభివృద్దే లక్ష్యంగా..ప్రజల సమస్యలే తన ఎజెండా..బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కిరణంలా..ముందుకు సాగుతున్న గండ్ర సత్యన్న ఆ భగవంతుని దీవెనలతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, ప్రజల ఆశీస్సులతో మరింత ఉన్నతమైన స్థానంలో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## జిల్లా యాదవ సంఘం నిర్మాణంలో
# గోవిందరావు సేవలు మరువలేనివి
### డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్



**తొలి సమయం ఇల్లందు నవంబర్ 15:** 1992 -93లో అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో, జిల్లా యాదవుల ఐక్యత కోసం యాదవ సంఘం అభివృద్ధి కోసం చంద్రకాని గోవిందరావు చేసిన కృషి మరువలేనిదని ఉందని, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తూరు సింహాద్రి యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన చంద్రకాని గోవిందరావు స్వగృహం నేలకొండపల్లి మండలం భైరవుని పల్లి గ్రామంలో జరిగిన దశదిన కర్మ కార్యక్రమంలో అఖిల భారత మహాసభ నాయకులు పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, గోవిందరావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు. ఉద్యోగం ఉన్నప్పటికీ, పదవీ విరమణ అయిన తర్వాత కూడా యాదవుల అభ్యున్నతి కోసం ఆలోచించేవాడని, నాటి యాదవ సంఘం పెద్దలు బోళ్ల వెంకటేశ్వరరావు, అమరబోయిన సైదయ్య, మీగడ కన్నయ్య, నాటి మంత్రివర్యులు సంగెం రెడ్డి సత్యనారాయణ, చిత్తారు శ్రీహరి , మరియు దుబాకుల శ్రీనివాస్ లాంటి పెద్దల సహకారంతో గోవిందరావు తో పాటు నేను కూడా ఆ రోజు లలో జిల్లా అంతట పర్యటించి, గొర్రెల సంఘాల ఏర్పాటుకు కృషి చేయడం జరిగిందని అన్నారు మల్లి బాబు యాదవ్ గుర్తు చేసుకున్నారు. ఎలాంటి స్వార్థం లేకుండా పనిచేశారని అన్నారు కృషి ఫలితమే ఈనాటి యాదవ సంఘం అభివృద్ధి అని తెలిపారు. యాదవ సంఘం పెద్దలమని చెప్పుకుని తిరిగే ఈనాటి నాయకులు ఆ రోజులలో కంటికి కూడా కనిపించలేదని, అలాంటి వ్యక్తి చనిపోవడం నాకు వ్యక్తిగతంగా తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దుబాకుల శ్రీనివాస్, మల్లెబోయిన శ్రీనివాస్,మేకల లక్ష్మీనారాయణ, చంద్రకాంత్ గట్టయ్య బుర్ర వెంకన్న కనక బండి కనకరాజు, కనక బండి రమేష్ మేకల మల్లికార్జునరావు మరియు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు
### పుస్తకం ప్రియతమ నేస్తం జిల్లా విద్యాధికారి పి. రాజేశ్వర్




**తొలి సమయం కలెక్టరేట్ నవంబర్ 15** 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయంలో రుస్తుక ప్రదర్శన ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వైద్యాధికారి డీఈవో.. పి రాజేశ్వర్ జ్యోతి ప్రజ్వలన చేసి రిబ్బన్ కట్ చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకం ప్రియతమ నేస్తం అన్నారు, ఓ మంచి పుస్తకం మంచి మిత్రునితో సమానం అని అన్నారు పుస్తకానికి మిత్రునికి సాపత్యం, సాన్నిహిత్యం సాహితీ బంధం ఉన్నదని అన్నారు మంచి మిత్రుడు అపకారం తలపెట్టడని అదేవిధంగా పుస్తకం కీడు చేయదని, విలువలను నేర్పుతుంది అన్నారు, అభివృద్ధి చేస్తుంది అన్నారు, సామాజిక అంశాలతో పాటుగా, సామాజిక బాధ్యతను నేర్పిస్తుంది అన్నారు ఈ పుస్తక ప్రదర్శనలో బాల సాహిత్యం, ఆధ్యాత్మిక సాహిత్యం దేశ చరిత్రలు, పోటీ పరీక్షకు సంబంధించిన పుస్తకాలు ఏర్పాటు చేయడమైనది అన్నారు ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ జి విజయందర్, సిహెచ్ రవి, రుద్రారపు వీరేందర్, బొడ్డు పెల్లి భూలక్ష్మి అశోక్ అనిల్ సతీష్, గ్రంథాలయ పాఠకులు సాహితీవేత్తలు పుస్తక ప్రియులు తదితరులు పాల్గొన్నారు.

## గండ్ర సత్యన్న పై అవధుల్లేని అభిమానాన్ని చాటుకున్న
# ఆకుతోట కుమారస్వామి, వైనాల రమేష్

**- పుట్టిన రోజు కానుకగా గండ్ర సత్యన్న చేస్తున్న సేవలపై సాంగ్ - సీడీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**తొలి సమయం జయశంకర్ భూపాలపల్లి 15:** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్ధారం గ్రామంలో గండ్ర సుశీల-సమ్మారావు దంపతులకు 15 నవంబర్ 1960న జన్మించిన గండ్ర సత్యనారాయణ రావు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు కాంగ్రెస్ పార్టీ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో . కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బాణాసంచా పేల్చి సంబరాలను జరుపుకున్నారు. అనంతరం కేక్ ను కట్ చేసి..పండ్లు, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, మండల నాయకుడు వైనాల రమేష్ లు గండ్ర సత్యన్న పై అవధుల్లేని అభిమానాన్ని చాటుకున్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని వైనాల రమేష్ సాంగ్ ను రాయగా..ఆకుతోట కుమారస్వామి ప్రొడ్యూసర్ గా వ్యవహరించారు. కాగా ఆ సాంగ్ ను సిడి చేయగా..భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు శుక్రవారం రేగొండ మండలంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం నందు ఆ సీడీని ఆవిష్కరించారు. అలాగే మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని సాంబశివ సామూహిక దేవాలయం లో గండ్ర సత్యన్న నిండు నూరేళ్లు కలకాలం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకుతోట కుమార్ స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చిట్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు తక్కల్లపల్లి రాజు, కాంగ్రెస్ పార్టీ మొగుళ్లపల్లి మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి రఫీ, జిల్లా నాయకులు కేతిపల్లి తిరుపతిరెడ్డి, మండ రవీందర్ గౌడ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ కొమురోజు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మొగుళ్లపల్లి టౌన్ ప్రెసిడెంట్ క్యాతరాజు రమేష్, జిల్లా, మండల నాయకులు నల్ల లింగారెడ్డి, చర్లపల్లి శ్రీధర్, కూస సుమన్, ఎలేటి శివారెడ్డి, పడిదల ప్రకాష్ రావు, మల్సాని రాజేశ్వర్ రావు, బండారి ఓదెలు, దానవేణి మొగిలి, యార అజయ్, మధుకర్, విజేందర్, మహిపాల్ రెడ్డి, గజ్జి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మనపల్లి ప్రభుత్వ పాఠశాలలో
# ఘనంగా చిల్డ్రన్స్ డే వేడుకలు



**తొలి సమయం టేకులపల్లి,నవంబర్ 15:** భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పుట్టినరోజును బాలల దినోత్సవంగా టేకుల పల్లి మండలంలోని బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. చాచా నెహ్రూ ప్రాధాన్యతను,ఆయన చేసిన సేవలను కొనియా డుతూ వక్తలు మాట్లాడారు.విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్కూలు హెచ్ ఎం, ఎం.జ్యోతిరాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పొగాకు లక్ష్మి, టీచర్లు పద్మ, నీరజా షారోన్, అంగన్వాడి టీచర్లు గుర్రం విజయలక్ష్మి,విజయ , సిఆర్పి అబ్బయ్య, ఎండీమ్ వర్కర్స్ సరోజ, పార్వతి విద్యార్థుల తల్లిదండ్రులు సురేష్, జగదీష్,వీరన్న, నరసింహారావు, రజిత, నవ్యశ్రీ, మౌనిక, సారిక, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల తో కూడా సమావేశం నిర్వహించి ప్రతిభ కలిగిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు, స్వీట్లు పంపిణీ చేశారు.

## ఎమ్మెల్యే గారు.. ఇల్లందు టు హైదరాబాద్
# ఏసీ బస్సు సౌకర్యం కల్పించండి
### ఇల్లందు మున్సిపల్ ఏడవ వార్డు కౌన్సిలర్ సామల మాధవి

**తొలి సమయం ఇల్లందు నవంబర్ 15:** ఏడవ వార్డు కౌన్సిలర్ సామల మాధవి ఇల్లందు టు హైదరాబాద్ కు ఏసీ బస్సు సౌకర్యం కల్పించాలని శాసనసభ్యులు కోరం కనకయ్యకు విజ్ఞాపన పత్రం ఓ ప్రెస్ నోట్ ద్వారా సమర్పించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ సింగరేణి పుట్టిన ఇల్లయిన టువంటి ఇల్లందుకు 130 సంవత్సరాల చరిత్ర ఉన్నది అన్నారు గత బిఆర్ఎస్ ప్రభుత్వం బస్సు డిపోను ఏర్పాటు చేశారని అన్నారు. అందులోనే భాగంగా మీరు కూడా రెండు ఏసీ బస్సుల ఇల్లందు టు హైదరాబాద్ కు సౌకర్యమును కల్పిస్తే మీకు ప్రజల్లో గౌరవం పెరుగుతుందన్నారు.

## అక్కెన పల్లి యాకయ్య
## మృతికి దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన
# టిపిసి ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి

**మహబూబాబాద్, తొలి సమయం నవంబర్ 15:**



మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జవాన్ల పెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి అంబాల శివకుమార్ బావమరిది ఇటీవల అక్కెనపల్లి యాకయ్య మరణించారు. మృతులు యాకయ్య కుటుంబాన్ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా పరామర్శించారు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో జమాల్ల పెల్లి గ్రామానికి చెందిన పిట్టల నవీన్ అజయ్, ఏరా శ్రీకాంత్, చైతన్య జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనం గండ్ర సత్యన్న

## గండ్ర సత్యన్న జన్మదిన వేడుకల్లో కేతిపెల్లి తిరుపతిరెడ్డి




**తొలి సమయం జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 15 :** నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనం భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యన్న అని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కేతిపల్లి తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఇప్పలపల్లి గ్రామంలో కేతిపల్లి తిరుపతిరెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గండ్ర సత్యనారాయణ రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి చిట్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్ గౌడ్ కేక్ కట్ చేసి, స్వీట్లు, పండ్లను పంపిణీ చేశారు.

# నాయకుల తప్పిదంతోనే విజయవాడ మునిగింది

## - విజయవాడ మునకకు బుడమేరు కారణం కాదు..! - సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**అమరావతి, నవంబర్15:** విజయవాడ మునకకు కారణం బుడమేరు కాదు.. నాయకుల తప్పిదం అన్నారు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, పూడిక తీస్తే వరదల ప్రభావం అంతగా ఉండదు.. ఆక్రమణల కారణంగా ముంపునకు ప్రభుత్వాలు చేసే తప్పుడు పనుల వల్ల ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఏలూరు జిల్లా మండవల్లి మండలం పెనుమాకలంక గ్రామంలో పర్యటించిన ఆయన.. కొల్లేరును పరిశీలించి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.. రోడ్లు, మంచినీళ్లు, డ్రైనేజీ సమస్యలను నారాయణ దృష్టికి తీసుకువచ్చారు గ్రామస్తులు.. కాంటూరు పరిధి తగ్గించి తమకు జీవనాధారం కల్పించాలని గ్రామస్తుల విజ్ఞప్తి చేశారు.. కొల్లేరు పూడిక తీయించి నీటి పారుదల సక్రమంగా ఉండేలా చూడాలని నారాయణ దృష్టికి తీసుకు వచ్చారు గ్రామస్తులు.. పూడిక తీయకపోవడం వల్ల వరదల సమయంలో లంక గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.. ఇక, ఈ సందర్భంగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ.. రాయలసీమలో ఎక్కడా నీళ్లు దొరకవు, మహిళలు కిలోమీటర్లు దూరం వెళ్ళి నీళ్లు తెచ్చుకుంటారు.. లంక గ్రామాల చుట్టూ నీళ్లు ఉన్నా తాగడానికి చుక్క నీళ్లు లేవు , అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా లంక గ్రామాల పరిస్థితి ఉందన్నారు.. ఆసియాలోనే అతిపెద్ద సరస్సు కొల్లేరు చేపలు పెంచుకోవచ్చు.. ఎలాంటి మందులు వాడకూడదన్నారు.. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో అప్పట్లో కొల్లేరు చెరువులు కొట్టేశారు.. సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ధిక్కరణ నోటీసులు ఇచ్చింది.. నాయకులు ప్రజల బాగు కోసం కాకుండా ఓట్ల కోసం కాంటూరు పరిధి గురించి మాట్లాడారని దుయ్యబట్టారు.

అయితే, విజయవాడ మునకకు కారణం బుడమేరు కాదు.. నాయకుల తప్పిదం, పూడిక తీస్తే వరదల ప్రభావం అంతగా ఉండదు ఆక్రమణల కారణంగా ముంపునకు ప్రభుత్వాలు చేసే తప్పుడు పనుల వల్ల ప్రజలకు ఇబ్బందులు అన్నారు. వర్షాలు, నీళ్ళు లేకపోతే బతుకే లేదు.. నీటి ప్రవాహానికి మనం అడ్డుకట్ట వేయకూడదు.. వాటి ప్రవాహాన్ని ఆక్రమనలతో అడ్డుకుంటేనే వరదలు వస్తాయన్నారు.. ముఖ్యమంత్రి చెబితే వినే అవకాశం ఇప్పుడు కేంద్రంలో ఉంది.. బుడమేరు నుంచి కొల్లేరు వరకూ పూడిక తీయాలి, లంక గ్రామాలకు రోడ్లు వేయాలని సూచించారు..మరోవైపు.. చిత్తూరు జిల్లా చంద్రగిరిలో ఎర్ర చందనం నిత్యం అక్రమంగా తరలిపోతూనే ఉంటుంది, కానీ, అటవీ శాఖ అధికారులు ఒక లారీ పట్టుకుని.. పది లారీలు వదిలేస్తారు అని ఆరోపించారు నారాయణ.. ఇక్కడ లంక గ్రామాల్లో రోడ్లు వేయాలంటే.. అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారు.. చంద్రబాబు కాదంటే కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పడిపోతుందన్నారు.. కేంద్రంలో చంద్రబాబుకి ప్రస్తుతం అంత పట్టుంది.. కేంద్రంతో మాట్లాడి సమస్యల పరిష్కారం చేయొచ్చు, పూడికలు తీయడం, ఆక్రమణలు తొలగించడం చేయాలి.. కనీస సమస్యలు లంక గ్రామాల సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ప్రధాని నరేంద్ర మోడీకి లేఖలు రాస్తాను.. కేంద్రం, రాష్ట్రం రెండూ కలిసి చేయాల్సిన పనులు ఇవి.. మేం ఓట్ల కోసం కాదు%"% జనం కోసం ఉంటాం 2025 ఫిబ్రవరి ఒకటో తారీకు కల్లా రోడ్లు వెయ్యకపోతే పెనుమాక లంక వెళ్లే దారిలో పోరాటం చేస్తాం.. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు.

# బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ భూసేకరణ తీరు!

**తొలి సమయం హైదరాబాద్,** భూసేకరణ విషయంలో గత బిఆర్ఎస్ అనుసరించిన నిరంకుశ విధానాలనే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోంది. రైతులను భూములు లేకుండా చేయడం సరికాదు. ఆరార్ ప్యాకేజీ ఇవ్వండ కాదు..భూమికి భూమి ఇవాలన్న నిబంధనలతో ముందుకు సాగాలి. అలాగే ప్రభుత్వ భూములు ఉన్న దగ్గర మాత్రమే పరిశ్రమలు పెట్టాలి. గతంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ భూసేకరణ అంతా బలవంతంగా సాగింది. రైతులను రోడ్డున పడేశారు. వారికి భూమి లేకుండా చేశారు. దీంతో రెండు నష్టాలు ప్రధానంగా జరుగనున్నాయి. ఒకటి వ్యవసాయం దెబ్బతినడంతో పాటు..రైతులు వారి కుటుంబాలు దిక్కుదివాణం లేకుండా పోతున్నాయి. బిఆర్ఎస్ హయాంలో ఇదే జరిగింది. రైతుల భూములు గుంజుకుని వారికి అరకొరగా ప్యాకేజీ ఇచ్చి రోడ్డున పడేశారు. అధికారులు బాగుపడ్డారు. లీడర్లు బాగుపడ్డారు. ఇళ్లూ, భూములు ఇచ్చిన రైతులు మాత్రం దిక్కులేని వారు అయ్యారు. పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం భూ సేకరణ జరిగిన ప్రతి ప్రాంతంలో ఇదే జరిగింది. వైఎస్ హయాంలో గంగవరం పోర్టు కోసం జాలర్లను బలవంతంగా ఖాళీ చేయించారు. పోర్టు వచ్చింది. వారి కుటుబాల్లో మాత్రం ఉద్యోగాలు రాలేదు. వారికి సక్రమమైన రీతిలో ఆర్ఆర్ ప్యాకేజీ రాలేదు. చివరకు గంగవరం పోర్టును ఆదానీ ఎగురేసుకు పోయారు. మచిలీపట్నం పోర్టు కావచ్చు..పోలవరం పరాజెక్టు కావచ్చు...మరే ఇతర ప్రాజెక్టు అయినా కావచ్చు..అలాగే జరిగింది. పోలవరం నిర్వాసితులకు ఇప్పటికీ కనీసం ఇల్లు కూడా సక్రమంగా కట్టి ఇవ్వలేదు. గుంజుకున్న భూములకు భూములు ఇవ్వలేదు. మల్లన్నసాగర్ రైతుల గతి కూడా అంతే అయ్యింది. ప్రజెక్టు వచ్చాక భూములు ఉన్నవారు, కొనుక్కున్న వారు బాగుపడ్డారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు...ఇలా చెప్పుకుంటూ పోతే... అనేక ఉదాహరణలు మన కళ్లకు కనబడుతున్నాయి. ఎక్కడా భూములు ఇచ్చిన వారు బాగపడలేదు. భూములు తీసుకున్న వారు, ఆ చుట్టుపక్కల కొనుక్కున్న వారు మాత్రమే బాగుపడ్డారు. ఇప్పుడు కూడా లగచర్లలో ఏర్పాటయ్యే ఫార్మా కంపెనీ ద్వారా కూడా అదే జరుగుతుంది. అందువల్ల భూసేకరణ పద్దతి మారాలి. అవసరం కోసం భూములు ఫార్మా పరిశ్రమలు పెట్టే వారే కొనుక్కోవాలి. ఫార్మకంపెనీలకు భూసేకరణ ద్వారా భూములు ఇవ్వడం కాకుండా వేలం పాట ద్వారా కావాల్సిన భూములు కొనుగోలు చేసుకునేలా చేయాలి. కంపెనీలు పెట్టాలనుకునే వారు భూములు కొనుక్కునేలా చేయాలి. ఇకపోతే భూములన్నీ పరిశ్రమలకు కేటాయిస్తూ పోతే వ్యవసాయం దెబ్బతింటుందని గుర్తించాలి. రైతులను వ్యవసాయం చేసి, మనకు అసవరమైన ఆహారధాన్యలు పండించేలా ప్రోత్సహించాలి. మనదేశం నూనెల కోసం ఇతర దేశాలపై ఆధారపడుతోంది. దానినుండి బయటపడేందుకు మన భూమల్లో నూనెగింజలు పండించేలా రైతులను ప్రోత్సహిస్తే బంగారం పండుతుంది. వేరుశనగ, నువ్వులు, పొద్దు తిరుగుడు పంటలు పుష్కలంగా మన నేలల్లో పండుతాయి. ఈ పంటలను ప్రోత్సహిస్తే..అవసరాలు తీరడంతో పాటు, రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారు. వ్యవసాయాధారిత కుటీర పరిశ్రమలతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించ వచ్చు. ఉపాధి, ఉద్యోగాలకు పరిశ్రమలే రావాల్సిన అవసరం లేదు. వ్యవసాయం, అనుబంధ రంగాలను ప్రోత్సహిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కాగలదు. నిరుద్యోగ సమస్య తీరగలదు. లగచర్ల విషయానికి వస్తే రైతులను సంప్రదించాలి. అఖిలపక్షంలో చర్చించాలి. అసలు ఫార్మా అవసరమా లేదా అన్నది కూడా విస్తృతంగా చర్చించాలి. ఇప్పటికే కాలుష్యంతో చస్తున్నాం. ఈ ఫార్మా కంపెనీతో కాలుష్యం పెరుగుతుంది. అందువల్ల బిఆర్ఎస్ అనుసరించిన నిరంకుశ విధానాలను రేవంత్ సర్కార్ విడనాడాలి. రైతులను రోడ్డున పడేసే కార్యక్రమాలను పక్కన పెట్టాలి. జీవనాధారమైన భూములు లాక్కొని అభివృద్ధి చేస్తామంటే... నమ్మడానికి లేదు. భూములు ఇచ్చిన రైతులు కుటుంబంతో ఎక్కడికి పోవాలి? ఎలా బతకాలి? అన్నది కూడా ఆలోచన చేయాలి. మమ్మల్ని చంపినా మా భూములివ్వం... ఇంచుభూమిని కూడా వదులుకోం అని లగచర్లతోపాటు సమీపంలోని పెచ్చెర్లగడ్డ తండా, ఆర్బీ తండా బాధిత రైతు కుటుంబాలు మొత్తుకుంటున్న వేళ, పాలకులు వారి గురించి ముందు ఆలోచించాలి. మీడియా ముందుకు వచ్చిన వారి గోడును వినాలి. వారి భూములు తీసుకోవాల్సి వస్తే..భూమికి భూమి ఇవ్వాలి. అలాగే ఇల్లుకు ఇల్లు ఇవ్వాలి. దాంతో పాటే పరిహారం కూడా ఇవ్వాలి. అల ఇవ్వడానికి వారిని ఒప్పించాలి. అంతేగాని బలవంతంగా భూసేకరణ సరికాదు. మా ఇండ్ల వద్దకొచ్చి.. మీ భూములు ఇచ్చేయండి, ఫార్మా కంపెనీ పెడుతున్నమని చెప్తున్నారు. సర్వేల పేరుతో రోజూ మా ఇండ్ల చుట్టూ తిరుగుతున్నరు. అధికారులు కూడా మా భూములు తీసుకుంటా మని బెదిరిస్తున్నరు. మాకు ఫార్మా కంపెనీ అక్కర్లేదు.. కంపెనీ పెడితే మా భూములు నాశమవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతుల బాధలను ఆలోచించాలి. ఉన్న భూములను సర్కారు లాక్కుంటే తామెలా బతకాలని బాధితులంతా గోడు వెళ్లబోసుకున్నారు. తమ ప్రాణాలు పోయినా భూములు ఇవ్వబోమని తేల్చి చెప్పారు. నోటీసులు కూడా ఇవ్వలేదని స్పష్టంగా చెప్తున్నారు.. ఫార్మా ఎందుకు పెడుతున్నారో చెప్పలేదని వారు తెలిపారు. 9 నెలలుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని బాధితులే అంటున్నారు. ఈ ఫార్మా సిటీ వల్ల మాకున్న భూమి, ఇల్లుతో సహా సర్వం పోతుందని వాపోతున్నారు. పుట్టిన నాటి నుంచి ఈ భూములతో మాకు అనుబంధం ఉంది. ఒక్కసారిగా భూములు ప్రభుత్వానికి అప్పజెప్పాలని అంటే మేం ఎక్కడికి వెళ్లాలి, ఎలా బతకాలని వారు వేస్తున్న ప్రశ్నలకు నేరుగా సిఎం రేవంత్ రెడ్డి, అధికారులు సమాధానం ఇవ్వాలి. మాకున్న పొలమే మాకు జీవనాధారం. ఫార్మా కంపెనీ కోసం మా పొలాలు కావాలని అడగడం సరికాదు. నోటికాడి కూడును లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉన్న భూమి పోతే ఎలా బతకాలి? అధికారులొచ్చి ఫార్మా కంపెనీకి భూములియ్యమంటున్నారు. మీకు మా భూములే దొరికాయా. ఉన్న భూములు ఇచ్చేసి మేమెలా బతకాలి? అలాగని మా భూములు తీసుకుంటామంటే అస్సలు ఊరుకునేది లేదు. జానెడు భూమికి కొట్లుకుసచ్చే రోజులివి. నాకున్న భూమి మొత్తం ఇవ్వమంటే ఎలా? అంటూ ఒక్కో కుటుంబం ఒక్కో గాధ వినిపిస్తోంది. నిజంగానే ఇది కన్నీటి వ్యథ. దీనిని అంతా ఆలోచించాలి. ప్రభుత్వమే తన విధానాలను మార్చుకోవాలి. రైతులను వేధించి భూములు తీసుకోవడం సిరికాదు. ఆర్ఆర్ ప్యాకేజీలు భూమికి భూమి, ఇంటికి ఇల్లు అన్న పద్దతిలో ముందుకు రావాలి. లేదా భూములను అమ్ముకునే రైతుల నుంచి మాత్రమే సేకరించాలి. లేదా ప్రభుత్వ భూముల్లో మాత్రమే పరిశ్రమలు పెట్టాలి. అలా కాకుండా రైతుల భూములను గుంజుకుని పరిశ్రమలు పెడతామంటే కుదరదు. ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ పోవడం వల్లనే ఇప్పుడీ దుస్థితి వచ్చిందన్నది కూడా గుర్తించాలి.

# హైదరాబాద్‌ను వేధిస్తున్న ట్రాఫిక్

## - వర్షాకాలంలో వరదల్లా మారుతున్న రోడ్లు - ఈ రెండు ప్రధాన సమస్యలపై ఫోకస్ - పక్కా ప్రణాళికకు సిద్ధం అవుతున్న సర్కార్

**తొలి సమయం హైదరాబాద్,నవంబర్15:** విశ్వ నగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ ప్రధానంగా ట్రాఫిక్, వరదల సమస్యలను ఎదుర్కొంటోంది. నిత్యం ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా మారాయి. అలాగే వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే రోడ్లు నదులను తలపిస్తున్నాయి. ఈ రెండు అంశాలపై రేవంత్ సర్కార్ తీవ్రంగా ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ట్రాఫిక్‌పై ఇప్పటికే చర్చ నడుస్తోంది. రోడ్లపైకి రోజూ వందలాదిగా కొత్త వాహనాలు రావడం కూడా తలనొప్పిగా మారింది. అలాగే ఇరుకు రోడ్లు కూడా ఇక్కట్ల పాటు చేస్తున్నాయి. ఈ క్రమంలో అవసరమైన చోట అండర్ పాస్‌లో, బ్రిడ్జిలు, రోడ్డు వెడల్పు వంటి కార్యక్రమాలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. దీనిని ట్రాఫిక్ పోలీస్ విభాగం పరిశీలిస్తోంది. యూటర్న్‌లు కూడా తీవక్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. తార్నాక యూ టర్న్ తొలగించాలని ఇటీవలే నిర్ణయించారు. అలాగే ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద కూడా యూటర్న్ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. దీనిని కూడా తొలగించాలని కోరుతున్నారు. ఇలా నగరంలో అనేక చోట్ల, ప్రధానంగా మెట్రోల వద్ద యూటర్న్‌లు ట్రాఫిక్ కష్టాలను పెంచుతున్నాయి. ఇకపోతే వరదనీరు నేరుగా మూసీలో కలవకుండా నాలాలన్నీ ఆక్రమణలకు గురయ్యాయి. ఇప్పటికే మైడ్రా వీటిని పరిశీలించి నివేదిక సిద్ధంచేసింది. ఈ క్రమంలో ఆక్రమణల తొలగింపు, నాలాల విస్తరణ వంటి చర్యలను తీసుకోవాల్సి ఉంది.

ఈ క్రమంలో వరద ముప్పు నుంచి హైదరాబాద్ మహా నగరాన్ని రక్షించేందుకు మహా ప్రణాళిక సిద్ధమవుతోంది. నగరంలో మూసీకి ఇరువైపులా 15 వరకూ చెరువులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. వరద నీటిని తొలుత ఈ చెరువుల్లోకి, అక్కడ నుంచి మూసీలోకి మళ్లించడం ద్వారా వరద ముప్పును ఎదుర్కోవచ్చనే అలోచనతో ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే అనేక చెరువులు కబ్జాకు గురయ్యాయి. ఉన్నవాటిల్లో పూడిక పేరుకుపోయింది. చెరువుల్లోకి కలిసే నాలాలూ పూడిపోయాయి. అందుకే చెరువుల ప్రస్తుత సామర్థ్యం, వాటి పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపైనా అధ్యయనం చేస్తున్నారు. చెరువులకు చేరిన నీరు మూసీలో కలిసేలా వ్యూహరచన చేస్తున్నారు. మూసీ సుందరీకరణ పథకానికి ఇది ఊతమిస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. నగరపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తోంది. 2050 అవసరాలను దృష్టిలో ఉంచుకొని వివిధ అంశాలపై రూపొందిస్తున్న మహా ప్రణాళికలో వరద మళ్లింపే కీలకమైనది. ఫిబ్రవరి నెలాఖరుకల్లా ఈ ప్రణాళిక సిద్ధం కానుందని సమాచారం.గతంలో ఎన్నడూ లేని విధంగా ఉన్నట్లుండి ఒకేసారి కుండపోత వర్షం కురుస్తుండడంతో నగర రోడ్లు నదులను తలపిస్తున్నాయి. వరదపోయే మార్గాలు మూసుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

# నాదొక కోరిక ఉంది..

## అదొక్కటి తీరిస్తే రాజకీయాలకు గుడ్ బై చెప్పేస్తా?

## సంచలన ట్వీట్ చేసిన మాజీ మంత్రి అంబటి

**అమరావతి, నవంబర్15:** నేను రాజకీయాలకు గుడ్ బై చెప్పేస్తా.. అయితే నాదొక కోరిక ఉంది. అదొక్కటి తీరిస్తే నేను రాజకీయాలకు స్వస్తి పలికి కూర్చుంటానంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు సంచలన కామెంట్స్ చేశారు. మీరు సై అంటే నేను సై సై.. అంటాను. అసలు సోషల్ మీడియా యాక్టివిస్టులపై కాదు కేసు పెట్టాల్సింది.. మీపై పెట్టాలి కేసులు. అసెంబ్లీ లో మీ తల్లిని అవమానించినట్లు నిరూపిస్తే.. నేను రాజకీయాలకు గుడ్ బై చెప్పేస్తా. మరి సిద్ధమా అంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు తాజాగా నారా లోకేష్ కు ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు. ఇటీవల ఏపీలో వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులను పోలీసులు అరెస్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో హద్దులు దాటిన ఏ ఒక్కరినీ వదిలి పెట్టకుండా పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. అలాగే టీడీపీ, జనసేన కార్యకర్తలు కూడా.. ఒక్కొక్కరిని వెలికితీస్తూ ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ అరెస్టులపై వైసీపీ భగ్గుమంటుండగా, టీడీపీ మాత్రం మహిళల వ్యక్తిగత హనానికి పాల్పడ్డ ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని చెబుతోంది. తాజాగా మాజీ మంత్రి అంబటి రాంబాబు అరెస్ట్ పర్వంపై ఓ ట్వీట్ చేశారు. అసలు కేసులు నమోదు చేయాలంటే ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు పై ఐపీసీ 420 సెక్షన్ కింద కేసు ఎందుకు పెట్టకూడదు తెలపాలంటూ ప్రశ్నించారు. అలాగే వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఇప్పటి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు లు ఇష్టారీతిన అనుచిత వ్యాఖ్యలు చేశారని, నాడు సీఎం హోదాలో గల జగన్ ను ఏక వచనంతో విమర్శించారన్నారు. కేసులు పెడితే ముందుగా వీరిద్దరిపైన కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని అంబటి రాంబాబు కొత్త నినాదం ట్వీట్ ద్వారా వినిపించారు. ఇక నారా లోకేష్ ఇలా చేస్తే తాను తప్పనిసరిగా రాజకీయాల నుండి తప్పుకుంటానని మాజీ మంత్రి అంబటి సవాల్ విసిరారు. శాసనసభలో తన తల్లిని అవమానించారంటూ నిన్న లోకేష్ చేసిన వ్యాఖ్యలపై అంబటి స్పందిస్తూ.. మీ తల్లిని అవమానించినటువంటి నిరూపిస్తే బేషరతుగా క్షమాపణ చెప్పి రాజకీయాలకు స్వస్తి పలుకుతానని అంబటి అన్నారు. ఇటీవల కొంత స్తబ్దతగా ఉన్న అంబటి.. ఒక్కసారిగా తన ట్వీట్లతో విరుచుకుపడడంతో, వీటికి తెలుగుదేశం పార్టీ ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

# పట్టణంలో ఎవరైనా చెత్త వేస్తే నీళ్లు కట్ చేస్తా

## తాడిపత్రి పట్టణ ప్రజలకు జేసీ ప్రభాకర్ రెడ్డి వార్నింగ్

**అమరావతి, నవంబర్15:** తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. తాడిపత్రి పట్టణ ప్రజలకు డెడ్ లైన్ విధించారు. ఈ క్రమంలో పట్టణ ప్రజలకు నాలుగు ఆప్షన్లు ఇచ్చారాయన. పట్టణంలో ఎవరైనా చెత్త వేస్తే నీళ్లు కట్ చేస్తామని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. అంతేకాదు కరెంటు కట్ చేస్తామన్నది రెండో ఆప్షన్. చివరగా పెనాల్టీ వేయడమేకాదు.. చెత్తను తీసుకొచ్చి సరాసరి మీ ఇంట్లోనే వేస్తామన్నారు. ఊరు బాగుంటే అందరం బాగుంటామన్నది ఆయన కాన్సెప్ట్. కానీ ప్రజల తీరు ఏ మాత్రం మారలేదు. దీంతో తమ మనసులోని ఆవేదనను బయటపెట్టారాయన జేసీ ప్రభాకర్‌రెడ్డి. మీరు మారుతారా? లేకుంటే తాడిపత్రి నుండి నన్ను తరిమికొట్టండంటూ వ్యాఖ్యానించారు. చివరకు వాహనాలు సైతం సరిగా పెట్టలేరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ విజయోత్సవ వేడుకలకు రంగం సిద్ధం

## ఏడాది పాలనపై ఫోకస్ పెట్టేలా కార్యక్రమాలు

**తొలి సమయం హైదరాబాద్,నవంబర్15:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుంటున్న క్రమంలో విజయోత్సవాలు ఘనంగా నిర్వహించబోతు న్నారు. ఏడాలిలో ప్రభుత్వం సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాలు తదితరాలను ఫోకస్ చేస్తూ కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. డిసెంబర్ 7వ తేదీకి రేవంత్ సర్కారు ఏర్పడి ఏడాది కావొస్తున్న నేపథ్యంలో.. ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది.ప్రభుత్వం. ఈమేరకు ప్రజాపాలన- విజయోత్సవాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష చేశారు. ప్రజాపాలన-విజయోత్సవాల్లో శాఖలవారీగా, విభాగాల వారీగా ప్రభుత్వం తొలి ఏడాదిలో సాధించిన విజయాలను, చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం ఆదేశించారు. ఈసందర్భంగా డిసెంబర్ 9 వరకు ప్రజాపాలన విజయోత్స వాలపై చేపట్టే కార్యక్రమాలను సీఎంకు అధికారులు వివరించారు. ఈ నెల 19న వరంగల్ వేదికగా.. 22 జిల్లాల్లో ఇందిరా మహిళాశక్తి భవనాలకు శంకుస్థాపన చేస్తారు. విజయోత్సవాల్లో భాగంగా వరంగల్, కరీంనగర్.. మహబూబ్‌నగర్ జిల్లాల్లో సీఎం రేవంత్ బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. ఇక డిసెంబర్ 7,8,9 తేదీల్లో విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేలా ప్లాన్ చేసింది. డిసెంబర్ 7న ట్యాంక్‌బండ్‌పై , 8న సచివాలయంలో .. 9న నెక్లెస్ రోడ్‌లో విజయోత్సవ వేడుకలు జరపనున్నారు. విజయోత్సవాల్లో భాగంగా డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణతల్లి విగ్రహావిష్కరణ చేయనున్నారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రాష్ట్రవ్యాప్తంగా మహిళలను ఆహ్వానించాలని నిర్ణయించారు. మహిళా సాధికారత, రైతుల సంక్షేమాన్ని సభల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే నియోజకవర్గాల వారీగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో రాష్ట్రమంతా పండుగ వాతావరణం నెలకొననుంది.

# చివరిదశకు మహారాష్ట్ర ఎన్నికల పోరు

## నాందేడ్ తదితర ప్రాంతాల్లో పవన్ కళ్యాణ్ ప్రచారం

**అమరావతి,నవంబర్15:** మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరింది. ప్రచార గడువు పద్దెనిమిదో తేదీన సాయంత్రం ముగియనుంది. సమయం ముగియడంతో పెద్ద ఎత్తున సభలు, సమావేశాలు నిర్వహించడానికి బీజేపీ నేతలు ఏర్పాట్లు చేశారు. మరోమారు అక్కడ అధికారం సాధించేందుకు బిజెపి తనముందున్న అన్ని అస్త్రాలను వినియోగిస్తోంది. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ తరపున ఎన్డీఏ నేతలు రంగంలోకి దిగుతున్నారు. చంద్రబాబుతో పాటు పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు మహారాష్ట్ర వెళుతున్నారు. శని, ఆదివారాల్లో పవన్ కల్యాణ్ నాందేడ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. మహారాష్ట్రలో తెలుగు వారు ఉన్న పలు ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ ప్రచారం సాగనుంది. నాందెడ్‌లో తెలుగు మూలాలున్న ప్రజలు ఎక్కువగా ఉన్నారు. అందుకే వీరిని ఆకట్టుకునేందుకు పవన్ కల్యాణ్‌తో ప్రచారం చేయించాలని నిర్ణయించారు. పవన్ కల్యాణ్ నాందేడ్ ప్రాంతంలో మొత్తం మూడు బహిరంగసభల్లో పాల్గొంటారు. ఇతర ప్రాంతాల్లోనూ వారి పర్యటన ఉంటుంది. పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రి సత్యకుమార్ కూడా ఈ ప్రచారంలో పాల్గొంటారు. నాందేడ్‌కు బీజేపీ తరపున ఎన్నికల ఇంచార్జ్‌గా ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. పవన్ కళ్యాణ్ ప్రచారం అంశాన్ని సోషల్ మీడియాలో ధృవీకరించారు. ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి గత నెల రోజులుగా నాందేడ్‌లోనే బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని సమన్వయం చేసుకుంటున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా బీజేపీ ముఖ్య నేతలు అంతా ఇప్పటికే ఒక విడత నాందేడ్‌లో ప్రచారం పూర్తి చేశారు. పవన్ కల్యాణ్, సత్యకుమార్ నాందేడ్ ప్రాంతంలో మూడు సభల్లో పాల్గొంటారు. ఇతర ప్రాంతాల్లోనూ విస్తృతంగా ప్రచారం చేస్తారు. పవన్, సత్యకుమార్ ప్రచారం వల్ల బీజేపీ విజయావకాశాలు మరింత మెరుగుపడి అభ్యర్థుల మెజార్టీలు భారీగా పెరుగుతాయని ఎన్నికల ఇంచార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101